## అభ్యర్థుల అరెస్టు తగదు

- రాహుల్‌గాంధీ అశోక్‌నగర్ లైబ్రరీకి వచ్చి ఓట్లు అడిగిన విషయం మరిచిపోయారా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): తమకు న్యాయం చేయాలంటూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగ విద్యార్థులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు నివసించే అశోక్‌నగర్‌లో కరెంట్ లేకుండా చేసి, అక్రమంగా నిర్బంధించడమేనా ప్రజాపాలన? అని ఎక్స్ వేదికగా నిలదీశారు. ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ అశోక్‌నగర్ లైబ్రరీకి వచ్చి ఓట్లు అడిగిన విషయం మరిచిపోయారా? అని ప్రశ్నించారు. పది నెలల పాలన పూర్తి కాకముందే విద్యార్థుల పట్ల కాంగ్రెస్ కపట ప్రేమ అసలు రంగు బయట పడిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్న దుర్మార్గ విధానాన్ని మార్చుకోవాలని హెచ్చరించారు.

## కాలేజీలకు తాళాలు వేసినా పట్టించుకోరా?

- తక్షణమే యాజమాన్యాలతో చర్చలు జరపాలి
- ఫీజు బకాయిలను చెల్లించాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్



హైదరాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా డిగ్రీ, పీజీ కళాశాలలను బంద్ చేసినా పట్టించుకోరా? అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే యాజమాన్యాలతో చర్చలు జరపాలని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.4వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలని 1,800 కాలేజీలను రెండురోజులుగా తాళాలు వేసి బంద్ చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. ఫీజు బకాయిల కోసం కాలేజీలకు తాళాలు వేయడం 76ఏండ్లలో ఎప్పుడూ జరగలేదని మండిపడ్డారు. పదినెలల పాలనలో ఏయే బిల్లులు చెల్లించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## తిండికే డబ్బులివ్వలే.. భవనాలెట్ల కడ్తరు?

**ఎంపీ ఈటల రాజేందర్**

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): గురుకుల పాఠశాలలకు డైట్ చార్జీలు ఇవ్వలేని ప్రభుత్వం, భవనాలు ఎలా కడుతుందని ఎంపీ ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ గురుకులాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల యజమానుల ఆవేదనను అర్థం చేసుకోవాలని, వారిని బెదిరించడం సరికాదని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యాలయాలకు కొత్తగా నిధులు మంజూరు చేయలేదని ఆరోపించారు.

## మాదిగలను వంచించిన రేవంత్ సర్కార్

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ**



ఖలీల్‌వాడీ, అక్టోబర్ 16: రేవంత్‌రెడ్డి సర్కార్ మాదిగ జాతిని వంచించిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. నమ్మకద్రోహానికి గురైన మాదిగలు రోడ్డు ఎక్కే పరిస్థితి నెలకొందని, ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయకపోతే మరో పోరాటం తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం లో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘా ల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడారు. రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఆగస్టు 1న ఆదేశాలు జారీ చేసిందని, అయి నా.. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, తెలంగాణలోని మాలల ఒత్తిడితో రేవంత్‌రెడ్డి సర్కారు వర్గీకరణను తొక్కి పెట్టేందుకు యత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తూ మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, కానీ వర్గీకరణ చేపట్టకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని ఫైర్ అయ్యారు.




అశోక్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న గ్రూప్-1 అభ్యర్థులు



పోలీసుల అదుపులో ఉన్న గ్రూప్-1 అభ్యర్థులు

# దద్దరిల్లిన అశోక్‌నగర్

మొదటిపేజీ తరువాయి...

తప్పులను, జీవో 29ని సవరించిన తర్వాతే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒక్కసారిగా రోడ్లపైకి గ్రూప్స్ అభ్యర్థులు దూసుకొచ్చి నినాదాలు చేయడంతో అశోక్‌నగర్ ప్రాంతమంతా దద్దరిల్లింది. దీంతో భారీగా పోలీసులు మోహరించి నిరసన తెలుపుతున్న అభ్యర్థులపై ఉక్కుపాదం మోపారు. పలువురు అభ్యర్థులను బలవంతంగా ఈడ్చుకెళ్లి బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగ జేఏసీ నాయకులు జనార్ధన్, ఇంద్రానాయక్, నర్సింహ, విశాల్, ఝాన్సీని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువు అభ్యర్థులు మాట్లాడుతూ జీవో 29, జీవో 55పై ఎటూ తేల్చకుండా, తప్పుడు ప్రశ్నల అంశాన్ని పరిష్కరించకుండా ఆగమేఘాల మీద గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికమో? కాదో? చెప్పకుండా ప్రశ్నల్లో తప్పులు దొర్లకుండా పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇవ్వకుండా, తెలుగు అనువాదం సరిగ్గా ఇస్తారా? లేదా? చెప్పకుండా పరీక్షలు ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. ఇవ్వన్నింటిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే గ్రూప్-2, 3 పరీక్షలు పెట్టలనుకోవడం కూడా నిరుద్యోగులను నిండా ముంచడమేనని మండిపడ్డారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షపై సుమారు 33 కేసులు దాఖలయ్యాయని, అవన్నీ పరిష్కారమైన తర్వాతే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు 2011లోనూ నిర్వహించి రద్దు చేశారని, 2016లో తిరిగి నిర్వహించారని గుర్తుచేశారు. మెయిన్స్ పరీక్షల్లోనూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని చెప్పారు. గ్రూప్-1 పరీక్ష ప్రిలిమ్స్‌లో అన్ని ప్రశ్నలూ తప్పులతడకలేని, 150 ప్రశ్నలకు 20 ప్రశ్నలు తప్పుగా వచ్చాయని గుర్తుచేశారు. ఈ కేసులన్నీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### గ్రూప్ 1 అభ్యర్థులను కలుస్తా : కేటీఆర్

తన మద్దతు కావాలని కోరిన గ్రూప్-1 అభ్యర్థుల అభ్యర్థన మేరకు వారిని కలుస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. 'కేటీఆర్ సర్.. మమ్మల్ని క్షమించండి.. దయచేసి అశోక్‌నగర్ రండి.. మాకు మీ మద్దతు కావాలి.. అన్ని సంస్థలూ రాజీపడ్డయ్.. మీరు వస్తే మీకు మొత్తం గ్రూప్-1 సంఘం రుణపడి ఉంటుంది..' అంటూ టీజీపీఎస్సీ అస్పిరెంట్స్ పేరిట సామాజిక మాధ్యమాల్లో విన్నపాలు వెల్లువెత్తాయి. ఇందుకు ప్రతిగా కేటీఆర్ స్పందిస్తూ 'మిమ్మల్ని కలుస్తాను. అశోక్‌నగర్ వేదికగా అయినా కావచ్చు లేదా తెలంగాణ భవన్ వేదికగా అయినా సరే మిమ్మల్ని కలుస్తా'నని కేటీఆర్ ఎక్స్ వేదికగా హామీఇచ్చారు. 'భారత రాష్ట్ర సమితి పార్టీ మీ అందరికీ న్యాయం జరిగేలా చూస్తుంది' అని భరోసా ఇచ్చారు. ఒక్క సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని తెలంగాణ యువతకు, తెలంగాణ సమాజానికి ఎప్పటికప్పుడు గుర్తుచేస్తూనే ఉంటామని కేటీఆర్ పేర్కొన్నారు.




పశ్చాత్తాపం వ్యక్తంచేస్తూ తమకు మద్దతు తెలపాలని కేటీఆర్‌కు ట్వీట్ చేసిన టీజీపీఎస్సీ అస్పిరెంట్స్

## తీర్పు ప్రకారమే గ్రూప్-1 నియామకాలు

- ఈ దశలో పరీక్షల నిలిపివేత ఉత్తర్వులు ఇవ్వలేం
- దివ్యాంగుల రిజర్వేషన్ కోటా వివాదంలో హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): గ్రూప్ – 1 నియామకాలు తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టంచేసింది. గ్రూప్-1 పరీక్షల నిలిపివేతకు నిరాకరించింది. ఈ నెల 21 నుంచి పరీక్షలు జరగున్నాయని, ఈ పరిస్థితుల్లో ఏవిధమైన మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయబోమని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వం, టీజీపీఎస్సీలకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను నవంబర్ 20కి వాయిదా వేసింది. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022 నాటి జీవో 55కు సవరణ తీసుకువస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 8న జీవో 29 జారీచేయడాన్ని సవాలు చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది.పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ జనరల్ క్యాటగిరీలోని అభ్యర్థులకంటే ఎక్కువ మార్కులు సాధించినవారిని అన్ రిజర్వుడుగా పరిగణించడం వల్ల దివ్యాంగులకు అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. వారి కంటే ఎక్కువ మార్కులు వచ్చినప్పటికీ రిజర్వేషన్ క్యాటగిరీ కిందనే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్‌కు పిలవాలని కోరారు. జీవో 55ను సవాల్ చేసిన వ్యాజ్యాలు విచారణలోనే ఉన్నాయని, దానికి సవరణ జీవో తేవడం చెల్లదని తెలిపారు. దీనికితోడు రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా 62 శాతానికి చేరడం చట్ట వ్యతిరేకమని అన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, అవి కార్యనిర్వాహక ఉత్తర్వులు మాత్రమేనని చెప్పారు. దివ్యాంగుల చట్టంలోని సెక్షన్ 34 ప్రకారం నిబంధనలు తీసుకువచ్చామని, జీవో రాజ్యాంగ విరుద్ధం కాదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు స్టే ఇచ్చేందుకు, పరీక్షలను వాయిదా వేసేందుకు నిరాకరించింది.

## గ్రూప్స్ అభ్యర్థులను విడుదల చేయాలి

- విద్యార్థుల అక్రమ అరెస్టులు సరికాదు
- అభ్యర్థుల వినతి మేరకు పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలి: కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): అశోక్‌నగర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా అక్రమంగా అరెస్టు చేసిన గ్రూప్-1 అభ్యర్థులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. గ్రూప్స్ అభ్యర్థులు కోరుతున్న మేరకు వెంటనే పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. పోలీసులు తమను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, అశోక్‌నగర్‌కు వచ్చి తమకు మద్దతు ప్రకటించాలని టీజీపీఎస్సీ అభ్యర్థులు బుధవారం రాత్రి కేటీఆర్‌ను ఎక్స్ వేదికగా అభ్యర్థించారు. 'కేటీఆర్ సార్.. మమ్మల్ని క్షమించండి. దయచేసి అశోక్‌నగర్‌కి రండి. మాకు మీ మద్దతు కావాలి. అన్ని సంస్థలూ రాజీపడ్డాయి. మీరు వస్తే, మొత్తం గ్రూప్-1 అభ్యర్థులు మీకు ఎప్పటికీ రుణపడి ఉంటారు' అని పలువురు అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యావంతులైన యువత నిరసన తెలిపే హక్కులను కూడా హరించి వేస్తున్నదని మండిపడ్డారు.

**ప్రాధేయపడి ఓట్లు వేయించుకొని..**

గ్రూప్స్ అభ్యర్థులు అనేక అంశాలపై తమకు న్యాయం చేయాలంటూ హైకోర్టులో పలు కేసులు వేసి న్యాయం కోసం ఎదురు చూస్తున్నారని, ఈ సమయంలో ఒక కేసులో వచ్చిన తీర్పుని అడ్డు పెట్టుకుని ప్రభుత్వం మొండిగా ఈ నెల 21న గ్రూప్స్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమవ్వడం దారుణమని కేటీఆర్ పేర్కొన్నారు. స్వయంగా విద్యార్థులే గ్రూప్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని కోరుతున్నప్పుడు ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. ఇదే అశోక్‌నగర్‌లోని యువతీ, యువకుల వద్దకు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేతలు వచ్చి ప్రాధేయపడి ఓట్లు వేయించుకొన్నారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల ఆకాంక్షలను పక్కనపెట్టి నిరంకుశంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. పోలీసుల చేత అరెస్టులు, దాడులు చేయిస్తున్న ప్రభుత్వ క్రూరమైన వ్యవహారాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదని పేర్కొన్నారు.




హనుమకొండలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, అధ్యాపకులు

## రెండోరోజూ కాలేజీల బంద్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై నిరసన
- ఏకశిలా పార్కు ఎదుట శాంతి దీక్ష
- హనుమకొండ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- నిజామాబాద్ ధర్నా చౌక్‌లో మానవహారం
- ప్రైవేటు కాలేజీల ఆందోళనకు టీఈపీసీఎంఏ సంఘీభావం

హైదరాబాద్/హనుమకొండ/ఖలీల్‌వాడి, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ బుధవారం రెండో రోజూ కొనసాగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చింది. రూ.2,500 కోట్లు బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ యాజమాన్యాలు మంగళవారం నుంచి కాలేజీల బంద్ పాటిస్తున్నాయి. కళాశాలలను నిరవధికంగా బంద్ చేసి హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కు ఎదుట శాంతి దీక్ష చేపట్టారు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సుమారు 70 కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, సిబ్బందితో కలిసి ఏకశిలా పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే, నిజామాబాద్‌లోని ధర్నాచౌక్‌లో వివిధ కళాశాలల యజమానులు, ఉద్యోగులు, బోధన, బోధనేతర సిబ్బంది బుధవారం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీడీఎంఏ నాయకులు శ్రీధర్ రావు, రవీంద్రనాథ్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**టీఈపీసీఎంఏ సంఘీభావం**

ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల బంద్‌కు తెలంగాణ ఇంజినీరింగ్, ప్రొఫెషనల్ కాలేజీల యాజమాన్య సంఘం (టీఈపీసీఎంఏ) చైర్మన్ డాక్టర్ ఎన్ గౌతమ్‌రావు, కార్యదర్శి డాక్టర్ కే సునీల్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించని కారణంగా రాష్ట్రంలోని అన్ని ప్రొఫెషనల్ కళాశాలలు కూడా ఇలాగే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న దృష్ట్యా బంద్‌కు సంఘీభావం తెలుపుతున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### గురుకులానికి తాళం వేసిన యజమానిపై కేసు

తుంగతుర్తి, అక్టోబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన అద్దె బకాయి కోసం గురుకుల పాఠశాలకు తాళం వేసిన బిల్డింగ్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలకు ప్రభుత్వం నెలల తరబడి అద్దె చెల్లించకపోడంతో భవనం యజమానికి బత్తుల లాలయ్య మంగళవారం పాఠశాల గేటుకు తాళం వేశారు. ఈ ఘటనపై పాఠశాల ప్రిన్సిపాల్ ఉమారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలయ్య బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

# సర్కారుపై బీఆర్‌ఎస్వీ సమరశంఖం

**విద్యారంగంలో సర్కారు నిర్లక్ష్యంపై పోరుకు సమాయత్తం**

- తక్షణ కార్యాచరణపై నేడు సమాలోచన
- విద్యార్థినేతలకు దిశానిర్దేశం చేయనున్న కేటీఆర్
- గురుకులాల నిర్వీర్యం చేసే కుట్రపై యుద్ధానికి సిద్ధం



హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలపై బీఆర్‌ఎస్వీ పోరుకు సన్నద్ధం అవుతున్నది. కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై విద్యార్థిలోకంలో చైతన్యం తెచ్చేందుకు సమాయత్తం అవుతున్నది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ విద్యార్థి విభాగానికి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ మేరకు హైదరాబాద్ తెలంగాణ భవన్ వేదికగా గురువారం సమాలోచనలు సాగనున్నాయి. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యవర్గం, అన్ని జిల్లాల విద్యార్థి విభాగాల బాధ్యులతోపాటు నియోజకవర్గానికి కనీసం 10 మంది విద్యార్థి నేతలు హాజరయ్యే ఈ సమావేశానికి పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శనాన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థి ప్రతినిధులకు వివరించనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదన్న విమర్శలున్నాయి. ఈ తరుణంలో బాధ్యతాయుతమైన విద్యార్థి సంఘంగా బీఆర్‌ఎస్వీ అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించనున్నారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు చేపట్టే ప్రణాళికలను రచించనున్నారు. విద్యావ్యవస్థలో అద్భుతాలు సృష్టించి అనేక అంశాల్లో దేశానికి ఆదర్శంగా పదేండ్ల కేసీఆర్ పాలనను, రేవంత్‌రెడ్డి సర్కార్ ఉద్దేశపూర్వకంగా అభాసుపాలు చేస్తున్న వైనాన్ని ఎలా తిప్పికొట్టాలనే విషయంలో కేటీఆర్ సహా ఇతర నాయకులు విద్యార్థులకు ఉద్బోధించనున్నారు.

### మా నిరసనకు మద్దతు ఇవ్వండి

**కేటీఆర్‌కు డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వినతి**

*హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు నిరసనగా తాము చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు మద్దతు ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును తెలంగాణ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. బుధవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడే వారికి తమ పార్టీ మద్దతు ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. తమ పార్టీ విద్యార్థి సంఘాల నేతలతో మాట్లాడి విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో తెలంగాణ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు బీ సూర్యనారాయణరెడ్డి, ఏ పరమేశ్వర్, రామకృష్ణ, ఈ నరసింహాయాదవ్, రామారావు, భాస్కర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.*

**సమీకృత మోసాన్ని ఎండగట్టే కార్యాచరణ**

రేవంత్‌రెడ్డి సర్కార్ సమీకృత గురుకులాల ఏర్పాటు ఆంతర్యాన్ని క్షేత్రస్థాయిలోనే ఎండగట్టాల్సిన అవసరాన్ని బీఆర్‌ఎస్వీ గుర్తించింది. ప్రస్తుతం ఉన్నవన్నీ సమీకృత గురుకులాలే అయినా, వాటిల్లో కల్పించాల్సిన సౌకర్యాలను, కనీసం అద్దెను చెల్లించలేని దైన్యం నెలకొన్నది. మరోవైపు కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దిన గురుకుల సొసైటీలను (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల పరిధిలో ఉన్న) దశలవారీగా ఎత్తివేయాలనే కుట్రను ఎండగట్టాల్సిన అవసరాన్ని బీఆర్‌ఎస్వీ గుర్తించింది. కేసీఆర్ సర్కార్ కేవలం పదేండ్ల కాలంలోనే 662 గురుకులాలను ప్రారంభించడమే కాకుండా, దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా 75 మహిళా డిగ్రీ కాలేజీలను ఏర్పాటుచేసి ఆదర్శంగా నిలిచిన వైనంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో చైతన్యం తెచ్చే కార్యాచరణను ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రూపొందిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమికను పోషించిన బీఆర్‌ఎస్వీ ప్రస్తుతం నెలకొన్న విద్యారంగ అంశాలపై గురుతర బాధ్యతను నెరవేరాల్సిన ఆవశ్యకతను గుర్తించింది. అందులో భాగంగానే బీఆర్‌ఎస్వీ ప్రతినిధుల సభలో కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నది. సత్వరమే ఫీజు రీయింబర్స్‌మెంట్, గురుకులాల సమస్యలపై పోరాడేందుకు సిద్ధం కానున్నది.

**నాడు ఉద్యమానికి ఊపిరిలూదిన సదస్సులు**

బీఆర్ఎస్ (నాడు టీఆర్ఎస్) పార్టీ నాటి ఉద్యమకాలంలో నిర్వహించిన విద్యార్థి సదస్సులు ఉమ్మడి పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. తెలంగాణ భవన్‌లో రాష్ట్రంలోని 94 అసెంబ్లీ నియోజకవర్గాల విద్యార్థులకు 2008 ఆగస్టు 11 నుంచి అక్టోబర్ 9 వరకు 50 రోజులపాటు దాదాపు 21,000 మంది విద్యార్థులకు పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో శిక్షణ తరగతు జరిగాయి. ఈ సదస్సుల్లో నీళ్లు, నిధులు, నియామకాలు, తెలంగాణ భౌగోళిక, సాంస్కృతిక అస్తిత్వానికి జరుగుతున్న అన్యాయంపై బోధనలు జరిగాయి. ప్రత్యేకించి హైదరాబాద్ నగరంలోని విద్యార్థినులకు 2007 డిసెంబర్ 18 నుంచి 20 2,000 మందికిపైగా శిక్షణ పొందారు. ఆ తరువాత రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన 'విద్యార్థి సదస్సు'లు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదాయి.

## కాంగ్రెస్ పాలనలో విద్యారంగం నాశనం

**మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శ**



డోర్నకల్, అక్టోబర్ 16: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నాశనం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. బుధవారం ఆమె మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల భవనాలకు అద్దె చెల్లిస్తలేదని, కాలేజీ యాజమాన్యాలకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. చదువును పక్కన పెట్టి విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు రోడ్లపై ధర్నాలు చేసే దుస్థితికి తీసుకొచ్చారని ఫైర్ అయ్యారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ చెల్లించకుండా పేద విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నారని, వారికి అన్యాయం చేస్తే బీఆర్ఎస్ పార్టీ సహించదని హెచ్చరించారు. మూసీ సుందరీకరణ కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసే కాంగ్రెస్ సర్కార్ దగ్గర.. భవనాల అద్దె, ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లించేందుకు పైసలు లేవా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలో 273 గురుకుల పాఠశాలుండేవని, అప్పటి సీఎం కేసీఆర్ వాటిని 1028కి పెంచి నాణ్యమైన విద్యను అందించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హోం, విద్య, ఎస్సీ, ఎస్టీ శాఖలకు మంత్రులు లేరని, సమీక్షలూ లేవని విమర్శించారు.